పుష్కలంగా ఇసుక నిల్వలు

- నక్కపల్లి డిపోలో అందుబాటులో ఇసుక
- క్యూ కట్టిన వినియోగదారులు



నక్కపల్లి డిపో వద్ద ఇసుక కోసం వచ్చిన వాహనాలు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లి డిపోకు ఇసుక వచ్చింది. గడచిన నెల రోజుల నుంచి ఇక్కడ ఏర్పాటు చేసిన ఇసుక డిపోలో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో పలు నిర్మాణాలు నిలిచిపోయాయి. ముఖ్యంగా జగనన్న ఇళ్ల కాలనీల్లో లబ్ధిదారులు నిర్మించుకునే ఇళ్లకు ఇసుక కొరత ఏర్పడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. అలాగే పలు సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, వివిధ గ్రామాల్లో జరుగుతున్న డ్రెయినేజీలు, రోడ్లుకు కూడా ఇసుక కొరత వచ్చింది. అధికారులు ఎట్టకేలకు స్పందించి రాజమండ్రి గోదావరి నుంచి ఇసుకను డిపోకు రప్పించారు. రెండు రోజుల నుంచి వందలాది లారీల్లో ఇసుక నక్కపల్లి డిపోకు తరలిరావడంతో లబ్ధిదారులు, వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డిపోలో 2వేల టన్నులకు పైగానే ఇసుక అందుబాటులోకి వచ్చింది. దీంతో ముందుగా బుక్ చేసుకున్న లబ్ధిదారులు ట్రాక్టర్లతో డిపో వద్ద క్యూ కట్టారు. ఇసుక అందుబాటులోకి రావడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి.

విద్యుత్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశం



చినదొడ్డిగల్లులో పథకాలను వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో విద్యుత్‌తో పాటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆదేశించారు. గురువారం గ్రామంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు వీధుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, అని ఆరా తీయడంతో పాటు, కరపత్రాల్లో ముద్రించిన పథకాలు మీకు వర్తించాయా లేదా అనేది తెలుసుకున్నారు. వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయి.. సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయా లేదా అని ఆరా తీసారు. అర్హతే కొలమానంగా జగనన్న ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. లబ్ధిదారులకు పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు వర్తింపజేసిన ప్రభుత్వంగా చరిత్రపుటల్లోకి నిలిచిపోయిందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం మాదన్నారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో రకమైన పథకం ద్వారా లబ్ధి కలుగుతోందన్నారు. చినదొడ్డిగల్లులో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రేబాక వెళ్లే లైన్‌కు అనుసంధానం చేయడం వల్ల గాలులు, వర్షాలు పడిన సమయంలో గ్రామానికి విద్యుత్ సమస్య ఏర్పడుతోందన్నారు. దీంతో వెంటనే ఆయన ట్రాన్స్‌కో ఏఈని పిలిచి రేబాక లైను వేరు చేసి చినదొడ్డిగల్లులో సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీని పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ తోట సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పాడగట్ల పాపారావు, బీసీ సెల్ నాయకులు శీరం నర్సింహమూర్తి, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, పార్టీ నాయకులు తాతబాబు, వెదుళ్ల రమణ, ఎస్.గోవిందు, వెలగా బాబ్జి, లక్ష్మణ్, దావీదు పాల్గొన్నారు.

ఆణిముత్యాలు అద్భుత కార్యక్రమం

ఎమ్మెల్యే బాబూరావు



విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి/ఎస్‌రాయవరం : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జగనన్న ప్రభుత్వం ఆణిముత్యాలు పేరుతో సత్కరించడం చరిత్రలో నిలిచిపోతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గురువారం కొరుప్రోలులో క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదోతరగతి, ఇంటర్‌లోఉత్తమ ఫలితాలు సాధించి మండల నియోజకవర్గ జిల్లా స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నగదు పురస్కారాన్ని విద్యార్థులకు అందజేశారు. జగనన్న ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రవేశ పెట్టిన ఈ ఆణిముత్యాలు పథకం విద్యాసంస్కరణలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. దేశం ఆదర్శంగా తీసుకునే పథకాలను అమలు చేయడం ఒక్క జగనన్నకే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు తీవ్ర కొరత ఏర్పడే పరిస్థితి ఏర్పడిందంటే సంస్కరణల ఫలితమేనన్నారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, గాంధీ, మూర్తి పాల్గొన్నారు.

కౌలురైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి



పొలాల్లో మట్టినమూనాలు సేకరిస్తున్న ఏవో

నక్కపల్లి : కౌలురైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ కోరారు. గురువారం గునిపూడిలో ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు. రైతులు కౌలు కార్డుల కోసం తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, పథకాలు పొందేందుకు ఈ కార్డులు అవసరమని అన్నారు. పొలాల్లో మట్టినమూనాలు సేకరిస్తూ వాటి ఆవశ్యకతను వివరించారు. పచ్చిరొట్ట వరి విత్తనాలు కావాల్సిన రైతులు దగ్గర్లో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు డిమాండ్ వచ్చింది..



జగనన్న విద్యా కానుక కిట్లతో పాములవాక జెడ్పీహైస్కూల్ విద్యార్థులు

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మకమైన సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలకు మంచి డిమాండ్ ఏర్పడిందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా అభివృద్ధి చెందాయన్నారు. దీంతో పాటు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు, యూనిఫాం, షూస్, టై, బెల్ట్‌లతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్నారన్నారు. మెరుగైన విద్యా బోధన కూడా అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన వేడిగాలులు

రాంబిల్లి : వడగాడ్పులు వీడడం లేదు. గురువారం వేడిగాలులు కొనసాగాయి. విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు, ఉపాధి కూలీలు ఇబ్బందులు పడ్డారు. జూన్ నెల సగం రోజులు గడిచిపోయినా వడగాడ్పులు కొనసాగుతుండడంతో జనం అవస్థలు పడుతున్నారు. మరోపక్క రైతులు ఖరీఫ్ సాగు పనుల కోసం వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. కానీ వరుణుడు కరుణ చూపడం లేదు.

రోడ్డు మరమ్మతులు చేపట్టరూ..

తుమ్మపాల : అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డును తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఐ నాయకులు ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయణిస్తున్న రహదారి అత్యంత దారుణంగా ధ్వంసమైతే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. గోతుల కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వియ్యపు రాజు, నరాలశెట్టి సత్యనారాయణ, సాయి, లక్ష్మణ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి, జ్ఞాపక శక్తికి యోగా దోహదం



వేంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుష్ సిబ్బంది

నక్కపల్లి : పిల్లల నుంచి, పెద్దల వరకు యోగా సాధన చేయడం ద్వారా మంచి ఆరోగ్యంతోపాటు, జ్ఞాపక శక్తి పెరుగుతుందని వేంపాడు ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యుడు డాక్టర్ రమేష్‌కుమార్ అన్నారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేంపాడులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ర్యాలీ చేయడం జరిగిందని, యోగాపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం ఆరోగ్యానికి రక్ష వంటివన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పీడీ రామకుమార్, యోగా ఇన్‌స్ట్రక్టర్లు డి.రాంబాబు, పార్వతి దేవి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సోలార్ బోర్లకు ఫారం 3 అవసరం లేదు

నక్కపల్లి : రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునే సోలార్ పవర్ బోర్లకు ఫారం 3 అవసరం లేదని తహసీల్దార్ అంబేద్కర్ తెలిపారు. మండలంలో సారిపల్లిపాలెంలో తన పొలంలో నిర్మించుకున్న వ్యవసాయ బోరుకు సమీపంలో కేవలం 20 మీటర్ల దూరంలోనే వేరొక రైతు రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా బోరు నిర్మించి సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసారని, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన ఈ రైతుకు అనుమతులు ఎలా ఇచ్చారని బాధిత రైతు శ్రీపాద ప్రణవ్ ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ బోరు నిర్మించి సోలార్ పవర్ ఏర్పాటు చేసుకుంటే ఎటువంటి అనుమతులు అవసరం లేదన్నారు. విద్యుత్ సరఫరా తీసుకుంటేనే ఫారం 3 అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

మేకలు, గొర్రెలకు డీ వార్మింగ్ కార్యక్రమం



సుంకపూరులో గొర్రెలకు డీ వార్మింగ్ మందు పడుతున్న సిబ్బంది

కోటవురట్ల : ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు పాడి పశువులు, మేకలు, గొర్రెలకు డీ వార్మింగ్ మందు పట్టనున్నట్టు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ సింహాద్రప్పడు తెలిపారు. గురువారం సుంకపూరులో కార్యక్రమం చేపట్టి గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్ మందు పట్టించారు. ఏడీ మాట్లాడుతూ కోటవురట్ల మండలంలో 11,394, మాకవరపాలెం మండలంలో 18,644 మూగ జీవాలు లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా మూగజీవాలకు డీ వార్మింగ్ చేయించాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిమాండ్ల పరిష్కారానికి అంగన్‌వాడీల ధర్నా



కశింకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల ధర్నా

కశింకోట : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం ధర్నా చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ అధికారులకు అందించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన ఆహార దినుసులు, నూనె, కందిపప్పు పరిమాణం పెంపు, గ్రాట్యుటీ, పెన్షన్ సదుపాయాలు తదితర డిమాండ్లతో నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తమకూ వర్తింప జేయాలని, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగేషు, యూనియన్ మండల అధ్యక్షురాలు టి.తనూజ, సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, ప్రతినిధులు పాల్గొన్నారు.

అభ్యుదయవాది శ్రీశ్రీ



మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తుమ్మపాల : మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో సీపీఎం జిల్లా కమిటీ గురువారం నిర్వహించింది. పార్టీ జిల్లా కార్యదర్శి కె లోకనాథం, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, వై.శివాజీ శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ శ్రీశ్రీ అందించిన అభ్యుదయ రచనలు ప్రజలను ఎంతగానో ప్రేరేపించాయన్నారు. సోషలిస్ట్ భావాల ప్రభావంతో ఆయన అందించిన పాటలు, సాహిత్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరావు, వి.వి.శ్రీనివాసరావు, తరుణ్, సంతోష్, నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక బోధనతో విద్యార్థుల రాణింపు

- నాడు–నేడుతో ప్రభుత్వ బడుల స్థాయి పెరిగింది
- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- జగనన్న ఆణిముత్యాల సత్కారాల పంపిణీ



ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారాయని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు.అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలకు సత్కారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేటి ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించారని, నాణ్యమైన బోధన, భోజనం అందించారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని తెలిపారు. ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వల్లేనని తెలిపారు. నాడు–నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనుల్లో కొద్ది పాటి అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలుసుకొని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అవినీతి చేస్తే తాను ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. నియోజక వర్గ స్థాయిలో మెరిట్ మార్కులు సాధించిన వారికి సత్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల్ని, విద్యాశాఖ అధికారుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి సంధ్య, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద, వడిశెల శ్రీనివాసరావు, దేశం శెట్టి శంకర్‌రావు, అచ్యుతాపురం ఎంఈవో దేవరాయలు, రాంబిల్లి ఎంఈఓ సూర్యారావు పాల్గొన్నారు.

నియోజక వర్గ స్థాయిలో ఏడుగురికి...

యలమంచిలి నియోజక వర్గ స్థాయిలో ఏడుగురికి జగనన్న ఆణిముత్యాలు సత్కారాలు అందజేశారు. అచ్యుతాపురం మండలంలో కమిరెడ్డి హేమశ్రీ(10వ తరగతిలో), ధర్మిరెడ్డి కావ్య(10వ తరగతిలో), మునగపాక మండలంలో శరగడం షణ్ముఖ (10వ తరగతిలో), ఎస్.రోహిణీ దుర్గ(ఇంటర్‌లో), యలమంచిలిలో ఎం. తారకేశ్వరి(ఇంటర్‌లో), కె.రమ్య(ఇంటర్‌లో), రాంబిల్లి మండలంలో బి.టి ఆదిత్య(ఇంటర్‌లో) ఈ సత్కారాలు పొందారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల, నియోజక వర్గ స్థాయిలో సత్కారాలు అందజేసి ప్రోత్సాహించడం పట్ల విద్యార్థులు హర్షం ప్రకటిస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు



సిరసపల్లిలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం దోహదపడుతుందన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధితో కూడిన బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షలు వంతున కేటాయింపు జరుగుతుందన్నారు. తద్వారా రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మల్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పార్టీ నాయకులు పొలమరశెట్టి వీరప్పారావు, నాయుడు అప్పలనాయుడు, నాగప్పారావు, మద్దాల జగ్గారావు, బొడ్డేడ జగ్గప్పారావుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలసిన వీసం



విజయసాయిరెడ్డిని కలిసిన వీసం

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ గురువారం కలిసారు. తాడేపల్లిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో సాయిరెడ్డిని కలసి తనకు ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్‌గా నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాయకరావుపేట నియోజక వర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను సాయిరెడ్డికి వివరించి ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. సాయిరెడ్డిని కలిసిన వారిలో స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.హరిబాబు, సర్పంచ్‌లు సురేష్‌వర్మ, ఎంపీటీసీ తిరుపతిరావు, భార్గవ్ తదితరులు ఉన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తెలిపారు. ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో గురువారం రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ వీరునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు రుణాలు అందజేస్తున్న కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు

యలమంచిలి : రైతులు రుణాలును సద్వినియోగం చేసుకోవాలని కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు అన్నారు. గురువారం యలమంచలి పీఏసీఎస్‌లో ఆయన ముగ్గురు రైతులకు రూ.17 లక్షల వ్యవసాయేతర రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులందరూ పంట రుణాలను పొందాలని వ్యవసాయేతర రుణాలకు ఎకరాకు రూ.5లక్షల రూపాయలు చొప్పున మంజూరు చేస్తామని సభ్యులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, కొక్కిరాపల్లి పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులందరూ సంకాలంలో రుణాలు తిరిగి చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు శ్రీ పందిరి రాంబాబు, యర్రంశెట్టి చిన్నాబ్బాయి, సీఈవో మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట



మల్లవరంలో విద్యాకానుక కిట్‌లు అందజేస్తున్న సర్పంచ్ హేమలత

మునగపాక : విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత పేర్కొన్నారు. మల్లవరం ప్రాథమిక పాఠశాలలో గురువారం జగనన్న విద్యాకానుక కిట్‌లను ఆమె అందజేశారు. ప్రయివేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని, నాణ్యమైన విద్యను అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సందర్శన

అచ్యుతాపురం(అనకాపల్లి): జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.వెంకటరావు గురువారం అచ్యుతాపురం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. వేసవి శిక్షణ తరగతుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో పాఠకులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం పాట నేడు

రాంబిల్లి : వెల్చూరు పరిధిలో గల నాగ లింగేశ్వర స్వామి ఆలయ భూములకు సంబంధించిన కౌలు లీజు కోసం శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నారు. మొత్తం 8.96 ఎకరాల భూమిని 3 ఏళ్ల కాలానికి కౌలుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్టు ఎండోమెంట్ అధికారులు పేర్కొన్నారు.

టి.సిరసపల్లిలో నేడు గడప గడపకు

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తరాజు పాల్గొని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిపై ప్రచారం చేస్తారన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.


అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



మండల సర్వేయర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న తహసీల్దార్ ప్రకాశరావు

మునగపాక : అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ ప్రకాశరావు అన్నారు. మునగపాక మండలం నుంచి బదిలీపై వెళ్లిన సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్‌లను గురువారం మండల పరిషత్ హాలులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు జోగినాయుడు, సత్యనారాయణ, రమేష్, వీరన్న, సురేష్ పాల్గొన్నారు.

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఆలీ

మునగపాక : ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ ఆలీ పిలుపునిచ్చారు. మునగపాకలో గురువారం దిశ యాప్‌పై ఆయన గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి మొబైల్‌లో యాప్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మహిళలకు ఈ యాప్ మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏఎస్ఐ మన్మథరావు,మహిళా పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.